# శుక్లాలు-మెల్లకన్ను

"భారతదేశంలో ఒక కోటిమంది శుక్లాలుతో బాధపడుతున్నారు. శుక్లాలను నిర్లక్ష్యం చేస్తే శాశ్వతంగా ఆంధత్వంతో బాధపడతారు" అని ప్రముఖ నేత్ర వైద్యులు డా॥రామ్‌కుమార్ పేర్కొన్నారు. వాసవ్య నర్సింగ్ హోమ్‌లో శనివారం డా॥మారు అధ్యక్షతన జరిగిన ఆరోగ్య సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని "శుక్లాలు-మెల్లకన్ను" అంశంపై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ సాధారణంగా 50-60 సంవత్సరాలు దాటిన వారిలో శుక్లాలు ఎక్కువుగా ఏర్పడతాయని, కొందరికి మాత్రం పుట్టుకతోనే ఉంటాయన్నారు. శుక్లాలు మందులతో తగ్గవని ఆపరేషను తప్పనిసరి అన్నారు. వైద్య శాస్త్రం అభివృద్ధితో నేడు శుక్లాల ఆపరేషను చాలా సులువుగా మారిందన్నారు. ఈ ఆపరేషనులో కుట్లు వేయనవసరం లేదన్నారు. ఆపరేషను చేయించుకున్న వెంటనే ఆసుపత్రి నుండి డిశ్చార్జి అయ్యి అన్ని పనులు మామూలగానే చేసుకోవచ్చన్నారు. శుక్లాల ఆపరేషను అనంతరం పూర్వంలాగా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోనవసరం లేదన్నారు. కేవలం మధుమేహం, బి.పి., ఉన్నవారు ఆహారంలో తీసుకోవలసిన జాగ్రత్లలే తప్ప శుక్లాల ఆపరేషను అనంతరం ప్రత్యేకంగా ఎటువంటి పథ్యాలు అవసరం లేదన్నారు. పూర్వకాలం శుక్లం ముదిరిన తర్వాత మాత్రమే ఆపరేషను చేయించుకోవాలనేకునేవారు. కాని నేడు ఆధునిక శస్త్ర చికిత్సలో శుక్లం ఏర్పడగానే ఆపరేషను చేయించుకుంటే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. అదే శుక్లం ముదిరిన తర్వాత అయినట్లైతే పూర్వ పద్ధతిలో కుట్లు వేసి ఆపరేషను చేయవలసి వస్తుందన్నారు. 40 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు దృష్టిలో లోపం ఏర్పడితే అశ్రద్ధ చేయకుండా నేత్ర వైద్యుడిని సంప్రదించాలన్నారు. ఒక్కోసారి చూపు మెల్లగా మసకబారతుంటే అందుకు కారణం శుక్లమే అనుకుని నిర్లక్ష్యం చేయకూడదని, అందుకు నీటికాసులు కూడా కారణం కావచ్చన్నారు. శుక్లాలుకంటే నీటికాసులని నిర్లక్ష్యం చేస్తే శాశ్వత అంధత్వం ఏర్పడవచ్చన్నారు. డా॥రామ్‌కుమార్ ఇంకా మాట్లాడుతూ చాలామంది మెల్లకన్ను అదృష్టమనుకుంటారని, అది అపోహన్నారు. మెల్లకన్నుని చిన్నతనంలోనే తల్లితండ్రులు గుర్తించి 6-7సంవత్సరాల లోపే డాక్టరుని సంప్రదించి మెల్లకన్నుని సరిచేయించాలన్నారు. లేదంటే వయస్సు పెరిగిన తర్వాత మెల్లకన్ను వల్ల శాశ్వతంగా చూపు దెబ్బతినే ప్రమాదముందన్నారు. ఈ ఆరోగ్య సదస్సులో మెల్లకన్ను, శుక్లాలకు చేసే ఆధునిక సర్జరీలతో పాటు వాటిని నిర్లక్ష్యం చేస్తే వచ్చే వ్యాధులని, వాటి సంరక్షణ వివరాలు దృశ్య శ్రవణ రూపంలో డాక్యుమెంటరి ప్రదర్శించారు.